రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి... 25 రోజులు గల్ఫ్‌లో చిత్రహింసలు



జరిగిన మోసాన్ని వివరిస్తున్న బాధితురాలు

**శంషాబాద్, ఆగస్టు11, ప్రభాతవార్త :** ఉద్యోగం పేరుతో ఏజెంట్ చేసిన మోసానికి వరంగల్‌కు చెందిన ఓ మహిళ 25 రోజులు గల్ఫ్‌లో చిక్కుకొని చిత్రహింసలు అనుభవిం చింది. మంగళవారం ఆమెను శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సురక్షితంగా తీసుకువాచ్చారు. గల్ఫ్ దేశంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి వర్క్ వీసాకు బదులు విసిటింగ్ వీసా ఇప్పించిన ఏజెంట్ కారణంగా వరంగల్ చెందిన మహముదా అనే బాధితురాలు తీవ్ర ఇబ్బందులకు గురైంది.
కుటుంబం నుంచి భారీ మొత్తంలో డబ్బు తీసుకున్న ఏజెంట్ లీగల్ వర్క్ వీసా ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని వాపోయింది. విసిటింగ్ వీసాపై మస్కట్ వెళ్లిన ఆ మహిళను అక్కడ షేక్‌లు నిర్బంధించి శారీరకంగా మానసికంగా వేధించారని తిరిగి భారత్‌కు వెళతానంటే జైల్లో వేస్తామని బెదిరించినట్లు వాపోయింది. గల్ఫ్ దేశానికి వెళ్లాలి అనుకునే వాళ్లు జాగ్రత్తంగా ఉండాలని ఆమె సూచించింది.



విచారణాధికారులతో వాగ్వాదానికి దిగిన గ్యాస్ వినియోగదారులు

# గ్యాస్ ట్రబుల్స్‌పై విచారణ మొక్కుబడే!

**నాలుగు గంటలపాటు వినియోగదారుల వాగ్వాదం**

**డీలర్‌కు అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆందోళన**

**అధికారుల సమక్షంలో సిలిండర్ తూకం.. తగ్గిన కిలో గ్యాస్**

**గోదామును తనిఖీ చేయకుండానే వెనుతిరగడంతో నిరసన**

**ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తుల ప్రకటన**

**పరిగి / కులకచర్ల, ఆగస్టు 11, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీ గురుదత్త భారత్ గ్యాస్ ఏజెన్సీ యజమాన్యం సాగిస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలపై స్థానిక వినియోగదారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర స్థాయిలో ఆందోళనకు దిగారు. విచారణ నిమిత్తం వచ్చిన అధికారులతో నాలుగైదు గంటల పాటు తీవ్ర వాగ్వాదానికి దిగి, నిరసన వ్యక్తం చేశారు.
డీలర్‌కు అధికారులు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల ఈ ఏజెన్సీ అక్రమాలపై ప్రభాతవార్తలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. పలువురు వినియోగదారులు జిల్లా సరఫరా అధికారి, భారత్ పెట్రోలియం అధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ నిర్వహించారు. సేల్స్ ఆఫీసర్ సచిన్, డిఎస్ఓ కార్యాలయ డీటీ తదితర అధికారులు గ్యాస్ కార్యాలయంలో వినియోగదారుల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. అనంతరం ఇప్పాయిపల్లి గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. సిలిండర్ నిర్ణీత ధర కంటే డీలర్ అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని ఈ సందర్భంగా విచారణలో గ్రామస్తులు, బాధితులు అధికారుల దృష్టికి తెచ్చారు, సకాలంలో గ్యాస్ రీఫిల్ అందించకపోగా, ప్రశ్నించిన వారిని ఇష్టానుసారంగా నిందిస్తున్నాడని పేర్కొన్నారు. ప్రతి సిలిండర్‌లోనూ గ్యాస్ తక్కువగా సరఫరా చేస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.
అధికారుల సమక్షంలోనే కిలో గ్యాస్ మాయం తూకంలో జరుగుతున్న మోసాన్ని ప్రత్యక్షంగా నిరూపించేందుకు వినియోగదారులు, నాయకులు అధికారులను నిలదీశారు. స్థానికుల సమక్షంలో అధికారులు ఒక సిలిండర్‌ను తూకం వేయగా, ఉండాల్సిన నిర్ణీత బరువు కన్నా ఏకంగా ఒక కిలో గ్యాస్ తక్కువగా వచ్చింది. కంప్యూటర్ రికార్డుల్లో నమోదైన స్టాక్ ఆధారంగా గ్యాస్ గోదాములోని నిండు, ఖాళీ సిలిండర్లను తనిఖీ చేసి అక్రమాలను లెక్కించాల్సి ఉంది. కానీ, విచారణకు వచ్చిన అధికారులు గోదామును ఏమాత్రం తనిఖీ చేయకుండానే వెనుతిరిగిపోవడంపై స్థానికులు, రాజకీయ నాయకులు తీవ్ర అనుమానాలు, విమర్శలు వ్యక్తం చేశారు.
గ్యాస్ డీలర్‌కు వత్తాసు పలుకుతూ, తూతూమంత్రంగా విచారణ జరిపి గోదామును తనిఖీ చేయకుండా వెళ్లిపోయిన అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు.
ఇప్పటికైనా పూర్తిస్థాయి విచారణ జరిపి శ్రీ గురుదత్త గ్యాస్ ఏజెన్సీ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపాల్, గ్రామ ఉపసర్పంచ్ వెంకటయ్య, జిల్లా ఎస్టీ సెల్ నాయకుడు శివరాం నాయక్, గోరుగడ్డ తండా కాంగ్రెస్ నాయకుడు రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసుకోవాలి

**వికారాబాద్, ప్రభాతవార్త :** ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం సేకరణకు వరి కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి అధికారులకు సూచించారు. మంగళవారం ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం సేకరణ నిమిత్తం ఏర్పాట్లపై ముందస్తు కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ. ఖరీఫ్ సీజన్ లో దొడ్డు, సన్న రకం వరి ధాన్యం సేకరణ ఉండనున్నట్లు దానికి అనుగుణంగా అదనంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకు అనుగుణంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూనికల తో పాటు సంచులను అందుబాటులో ఉంచేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గోదాంలు ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ఒక ప్రణాళిక పద్ధతి ప్రకారం ముందుకు వెళితే సక్సెస్ అవుతుందన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన అన్నారు. ఒక మిల్లుకు 60 మంది హమాలీలు తగ్గకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ అధికారి కవిత, డీసీఓ శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీఓ నర్సింలు, డీసీఎంఎస్ రమణారెడ్డి, డిటిసిఎస్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

## ఎన్నికలకు ఏడాది ముందే పనులను పూర్తి చేస్తాం..

**తాండూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త :** పక్కా ప్రణాళికతోనే తాండూరును అభివృద్ధి దిశలో ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తాండూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మీడియాతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పక్కా ప్రణాళిలతోనే తాండూరును అభివృద్ధి దిశలో ముందకు తీసుకువెళ్లడం జరుగుతందని తెలిపారు. ఇప్పటికే రూ.1500కోట్లతో వివిద అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఎన్నికలకు ఏడాది ముందే అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. తాండూరు అభివృద్ధి కోసం అసెంబ్లీలో కూడా చర్చకు తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 65వేల ఓట్లు తొలిగిపోయే అవకాశం ఉందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో మేరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.

# కాగితాల్లో కాదు... పనుల్లో మార్పు కనిపించాలి

**జిల్లా, మండల స్థాయి అధికారులకు అదనపు కలెక్టర్ కిరణ్మయి దిశానిర్దేశం**



సమగ్ర సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్మయి

**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధినే ప్రథమ ప్రాధాన్యంగా ఎంచుకొని, ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి పిలుపునిచ్చారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో పాటు వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమగ్ర సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాభివృద్ధి అనేది కేవలం ఒకే శాఖ బాధ్యత కాదని, వివిధ శాఖలు తమ వద్ద అందుబాటులో ఉన్న నిధులు, వనరులను ఒకదానికొకటి అనుసంధానించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రతి గ్రామానికి ఒక స్పష్టమైన అభివృద్ధి దిశ ఉండాలని, కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో మార్పు కనిపించేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ప్రతి గ్రామానికి జీపీ సాప్ బుక్‌లెట్**

గ్రామంలోని జనాభా, తాగునీరు, రోడ్లు, విద్యుత్, వైద్యం, వ్యవసాయం, పారిశుధ్యం, నీటి వనరుల వివరాలతో కూడిన సమగ్ర జీపీ సాప్ ప్రాజెక్ట్ బుక్ లెట్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమాచారమే రాబోయే 2026-27 గ్రామ్ పంచాయత్ అభివృద్ధి ప్రణాళికలకు ప్రాథమిక మూలస్తంభంగా నిలుస్తుం దని తెలిపారు.

**మొక్కలు నాటటంతోపాటు బతికించాలి**

వర్షపు నీటిలో ప్రతి బొట్టును సంరక్షి ంచేలా ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, పెర్కోలేషన్ ట్యాంకుల నిర్మాణాన్ని వేగ వంతం చేయాలని ఆదేశించారు. నాటిన మొక్కలను నాటడం తోనే సరిపెట్టుకోకుండా, వాటి సంరక్షణ బాధ్యతను ఆయా శాఖలు తీసుకోవాలని, నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పా రు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామా ల్లో మురుగు కాలువల శుభ్రత, తాగునీటి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులను ఆదేశించారు.
పారిశుధ్యం అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగాలని స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్ సహా విద్యుత్, నీటిపారుదల, రోడ్లుభవనాలు, సంక్షేమ శాఖల జిల్లా మరియు మండల స్థాయి అధికారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాణాంతక వ్యాధులకు ఆర్థిక భరోసా!

**గుండె, క్యాన్సర్, అవయవ మార్పిడి శస్త్రచికిత్సల నిమిత్తం దళితులకు రూ.3.50 లక్షల వరకు సాయం**

**కలెక్టర్ మనుచౌదరి వెల్లడి**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11, ప్రభాతవార్త :** అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు డాక్టర్ అంబేద్కర్ వైద్య సహాయ పథకం కింద వైద్య సహాయం అందించటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు.
మంగళవారం జిల్లా కలెక్టర్ పేర్కొంటూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యొక్క భావజాలం, తత్వాన్ని ప్రచారం చేయటం, డాక్టర్ అంబేద్కర్ జన్మ శతాబ్ది ఉత్సవాల కమిటీ సిఫారసుల నుంచి ఉద్భవించిన కీలక సంక్షేమ పథకాలను నిర్వహించటం లక్ష్యంగా ఏర్పాటైన డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్ భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థాపించబడిన స్వయం ప్రతిపత్తి గల సంస్థ జనవరి 2004నుంచి డాక్టర్ అంబేద్కర్ వైద్య సహాయ పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు.

**వార్షిక ఆదాయం రూ.5 లక్షలు లోపు ఉన్నవారికే అర్హత**

ఈ పథకం అవయవ మార్పిడి, వెన్నుముక శస్త్ర చికిత్సలు, కిడ్నీ, క్యాన్సర్, మెదడు సంబంధిత వ్యాధులతో సహా తీవ్ర మైన ప్రాణాంతకమైన వ్యాధులతో బాదపడుతున్న ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రోగులకు కీలకమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని, వీరి వార్షిక కుటుంబ ఆదాయం 5లక్షల రూపాయలు కంటే తక్కువగా ఉండాలని, వ్యాధుల వారీగ గరిష్ట పరిమితి వివరాలను ఆయన తెలియజేశారు.
గుండె శస్త్ర చికిత్స-వ్యాధి రూ.1.50లక్షలు, మూత్రపిండాల శస్త్ర చికిత్స, డయాల్సిస్ రూ.3.50లక్షలు, క్యాన్సర్, శస్త్ర చికిత్స, కీమోథెరఫీ,రేడియోథెరఫీ రూ.2.50లక్షలు, బ్రెయిన్ సర్జరీ రూ.2లక్షలు, మూత్రపిండం, అవయవ మార్పిడి రూ.3.50లక్షలు, వెన్నెముక శస్త్ర చికిత్స రూ.1.50లక్షలు, ఇతర ప్రాణాంతక వ్యాధులు గరిష్ట పరిమితి రూ.2లక్షలు. ఉన్నట్లు తెలిపారు.
ఈ సంక్షేమ పథకం యొక్క పరిధిని ప్రభావాన్ని విస్తృతం చేయటానికి డాక్టర్ అంబేద్కర్ వైద్య సహాయ పథకంను 2026లో సమగ్రంగా సవరించటం జరిగిందని ఆయన వివరించారు. ఈ సవరణలు అర్హత గల వ్యాధుల పరిధిని, ఎంప్యానెల్డ్ ఆసుపత్రులను విస్తరిస్తాయని అర్హులైన అభ్యర్థులు పోస్ట్ ద్వారా వైద్య సహాయం కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. దరఖాస్తులను నిర్దేశించిన దరఖాస్తు ఫార్మెట్ ప్రకారం సాదా కాగితంపై ముసాయిదా రూపంలో సమర్పించాలన్నారు. దరఖాస్తు మార్గదర్శకాలు, ఫారమ్‌లు మరిన్ని వివరాలు అధికారిక డిఎఫ్ వెబ్‌సైట్‌లో డిఒఎస్‌జెఇ. జిఒవి.ఇన్ సంప్రదించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు.

# పకడ్బందీగా పంద్రాగస్టు ఏర్పాట్లు

**అధికారులకు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశం**




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించటానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో ఈ నెల 15న జరుగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను తిలకించేందుకు వచ్చే అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండ సదుపాయాలు కల్పించాలన్నారు.
ముఖ్య అతిథికి పోలీసు గౌరవవందనంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చూడాలని పోలీసుశాఖ అధికారులకు సూచించారు. వేదిక, కుర్చీలు, బారికేడింగ్, సిట్టింగ్ వంటి ఏర్పాట్లు ఆర్అండ్‌బి శాఖ, వేదిక వద్ద రంగురంగు పూల తో అలంకరణకు జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు చూడాలన్నారు. మైక్ సౌండ్ బాక్సులను ఏర్పాటు చేయాలని ఐఅండ్‌పిఆర్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యార్థులచేత దేశభక్తిని చాటే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారిని ఆయన ఆదేశించారు. విధి నిర్వాహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసేందుకు అన్ని శాఖల అధికారుల వివరాలు సిద్దంగా ఉండేలా చూడాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవరించి విజయవంతం చేయాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, కీసర ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మొయినాబాద్‌లో అమ్మవారి విగ్రహం అదృశ్యం

**గ్రామస్తుల ఆందోళనతో తీవ్ర ఉద్రిక్తత**

**అధికారులే మాయం చేశారని ధ్వజం**





విగ్రహం తొలగింపుపై ఆందోళన చేస్తున్న స్థానికులు

**మొయినాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** మొయినాబాద్ మున్సిపాలిటీలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలో ఆలయ విగ్రహం తొలగింపు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇక్కడ పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ గత 45 రోజులుగా బాధితులు నిరాహార దీక్ష చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి దీక్షా శిబిరం వద్ద ఓ పుట్ట వద్ద చిన్న ఆలయాన్ని నిర్మించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అయితే మంగళవారం ఉదయానికి ఆ విగ్రహం అక్కడ కనిపించకపోవడంతో బోనాలతో వచ్చిన భక్తులు, దీక్షాకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులే విగ్రహాన్ని తొలగించి సురక్షిత ప్రాంతానికి తరలించారని తెలియడంతో మహిళలు, బాధితులు అధికారులను నిలదీశారు. విగ్రహాన్ని తిరిగి అప్పగించే వరకు కదిలేది లేదంటూ ప్రధాన రహదారిపై బైఠాయించి తహసీల్దారుకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో సుమారు 20 నిమిషాల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న మొయినాబాద్ సీఐ మల్లికార్జునరెడ్డి, ఎస్ఐలు నైముద్దీన్, వెంకన్న తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ వివాదం వెనుక సుదీర్ఘమైన ఇళ్ల స్థలాల సమస్య ఉంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సర్వే నంబర్ 151లో 390 మంది నిరుపేదలకు 60 గజాల చొప్పున ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ వారికి స్థలాలు చూపించలేదు.
బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కాలనీ పేరుతో స్థలాలు కేటాయించేందుకు నాటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే కాలె యాదయ్య శిలాఫలకం వేసినా, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కాగా, గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌ను అజీజ్ నగర్ సర్వే నంబర్లు 176, 177తో పాటు హిమాయత్ నగర్ సర్వే నంబర్ 151లో ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయిస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో బాధితులు ఆందోళన బాట పట్టారు. ఈ ఘటనపై తహసీల్దార్ గౌతమ్ కుమార్ స్పందిస్తూ ప్రభుత్వ భూముల్లో ముందస్తు అనుమతులు లేకుండా ఆలయాలు లేదా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. అధికారులను సంప్రదించి స్థలం కేటాయించిన తర్వాతే ఆలయ నిర్మాణం చేపట్టాలని, అనుమతి లేకుండా కట్టినందుకే విగ్రహాన్ని సురక్షి త ప్రాంతానికి తరలించామని తెలిపారు. ప్రభుత్వ భూమిని సంరక్షించడంలో భాగంగానే ఈ చర్య తీసుకున్నామని, భక్తుల మనో భావాలను దెబ్బతీసే ఉద్దేశం తమకు లేదని వివరణ ఇచ్చారు.
ఆందోళన సమాచారం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చినా కొన్ని కారణాల వల్ల కేటాయింపులు పూర్తికాలేదని, ప్రస్తుతం మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో సర్వే నంబర్ 151ను సర్వే చేసి లేఅవుట్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించడంతో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడుతానని తెలిపారు. అనంతరం బిజెపి నాయకులు, కౌన్సిలర్లు అధికారులతో మాట్లాడి భక్తుల మనోభావాలను గౌరవించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు మరియు ఇండ్ల స్థలాల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో మామా,అల్లుడు మృతి

**కల్తీ కల్లా? లేక కలుషిత ఆహారం కారణమా? పోలీసు దర్యాప్తు ముమ్మరం**

**యాలాల, ఆగస్టు 11,ప్రభాతవార్త :** అనుమానాస్పద స్థితిలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ సంఘటన యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని కోకట్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకరాం వివరాలు ఇలా ఉన్నాయి. కోకట్ గ్రామ మిత్రానగర్ నివాసులైన గోరెప్ప(32)అబ్దుల్ లయఖత్(45) గ్రామ పరిధిలో సుమిత్ అనే వ్యక్తికి చెందిన పాలిషింగ్ యూనిట్‌లో నివాసం ఉంటున్నారు. పాలిష్ యూనిట్‌లోని ఓ గదిలో ఉంటున్న వీరు సోమవారం రాత్రి ఇద్దరు కలిసి మద్యం సేవించారు. భోజనం చేసి యధావిదిగా పడుకున్నారు. మంగళవారం ఉదయం చూసేసరికి ఇద్దరూ మృతిచెంది విగతజీవులుగా పడి ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. వీరిద్దరి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. కల్తీ కల్లు సేవించి మృతి చెందారా? లేక కలుషిత ఆహారమే ప్రాణం తీసిందా? లేక మరేదైన కారణమా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృత దేహాలను పోస్టుమార్టం నిర్వహించేందుకు తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని డిఎస్పీ నర్సింగ్ యాదయ్య సందర్శించి పరిశీలించారు.

## చేయూత పింఛన్ కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లాలో చేయూత ఫెన్షన్ పథకము క్రింద అర్హత కలిగినవారిని గుర్తించి ఈ నెల 31 వరకు దరఖాస్తుచేసుకోనే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి అన్ని మండలాల ఎంపీడీఓ, ఎంపీవో, డీఈ, ఏఈలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నియమ నిభందనల ప్రకారం చేయూత ఫెన్షన్ దరకాస్తులను ఈ నెల 31 వరకు స్వీకరించాలని, మ్యాడూల్ ప్రాకారం వెరిఫికేషన్ చేయాలనీ, దరఖాస్తు డాటా ఎంట్రి చేయడంలో జాగ్రతలు తీసుకోవాలని అన్నారు. ఎవరు ఏ లాగిన్‌లో ఎంట్రి చేశారన్న విషయం రికార్డ్ అవుతున్నందున తోదరపడి డాటా తప్పుగా ఎంట్రి చేయకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుందన్నారు. మొదటి విడత స్కూల్ యూనిఫార్మ్ ఆయా స్కూల్స్‌లో ఇవ్వాలని, పంచాయతిరాజ్ అధ్వర్యంలో జరుగుతున్న పనులను పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, మండల స్థాయి ప్రజావాణి ఏర్పాటు చేసి దరఖాస్తులను మండల స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం పురోగతి, ప్రజావాణి ద్వారా అందుతున్న దరఖాస్తుల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం నిర్దేశించిన ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించే దరఖాస్తులను సాధ్యమైనంత వరకు మండల స్థాయిలోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.


హెచ్‌ఎంకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న బ్రహ్మకుమారి

## మాదకద్రవ్యాలతో భవిత అంధకారం

**పూడూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త :** మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదం ఉందని బ్రహ్మకుమారి వికారాబాద్ సంచాలకులు మధు అక్కయ్య బ్రమ్మకుమారి పేర్కొన్నారు. మంగళవారం పూడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఓం శాంతి భవనం, నశాముక్త భారత అభిమాన, మిషన్ స్పందనల ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుట్కా, తంబాకు, సరాయి, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. అనంతరం వికసిత్ భారత్‌లో భాగంగా పాఠశాల విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయుడికి బ్రహ్మకుమారి ప్రశంసా పత్రంతోపాటు బహుమతిని అందజేశారు.

## అలరించిన న్యాయవాదుల క్రీడాపోటీలు

**ఆమనగల్లు, ఆగస్టు11, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఆమనగల్లు బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన న్యాయవాదుల క్రీడాపోటీలు అందరిని ఆకట్టుకున్నాయి. కేసులతో పరిష్కారం కొరకు ఎప్పుడూ ఆలోచనలతో కుస్తీలు పట్టే న్యాయవాదులు క్రీడలలో పాల్గొని సరదా గడిపారు. కాగా బార్ అసోషియేషన్ అధ్యక్షుడు అండేకర్ యాదిలాల్ అధ్యక్షతన జరిగిన పోటీలను ఆమనగల్లు ప్రాథమిక జూనియర్ సివిల్ న్యాయమూర్తి నారం అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. పోటీలలో న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది ఉల్లాసంగా ఆటల పోటీలలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శరీర ధార్యుడుత్వానికి ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. క్రీడలలో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, జానకి రాములు, జమీల్, ఆమనగల్లు జూనియర్ కోర్టు సూపరింటెండెంట్ మురళీకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శేఖర్, సంయుక్త కార్యదర్శి మధు గౌడ్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, కోశాధికారి మల్లేష్. గ్రంథాలయ సెక్రటరీ గణేష్ గౌడ్. క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, సర్దార్ నాయక్, సీనియర్ న్యాయవాదులు జగన్ గౌడ్, కొప్పు కృష్ణ, మల్లేష్, ఆంజనేయులు,బీక్య నాయక్, రమేష్, శివ,శ్రీనివాస్, ప్రభు నాయక్, శ్రీశైలం, రామ చంద్రయ్య, లక్ష్మణ్, శివశంకర్, మహేశ్వర్, అజయ్ కుమార్, నరేందర్, శిరీష, శైలజ, మమత తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భూములను పరిరక్షించండి

**దోమ, ఆగస్టు 11, ప్రభాతవార్త:** దోమ మండల పరిదిలోని దొంగయెన్కెపల్లి గ్రామంలో సంజీవ ఆంజనేయస్వామి దేవాలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని బిజెపి నాయకులు ముకుంద నాగేశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతోపాటు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసిన చర్యలు లేవని విమర్శించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి, భూభారతిలలో ఆలయ భూముల సర్వే నంబర్లు పరిశీలిస్తే అసలు దొంగలు బయటపడతారన్నారు. పరిగి పట్టణంలోని అతి పురాతనమైన వేణుగోపాలస్వామికి సంబంధించి వందల కోట్ల విలువైన ఆలయ భూములను పరిరక్షించాలని విజ్ఞప్తిచేశారు. దోమ మండలం సంజీవ ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల అబివృద్ధికి రూ.10 కోట్లు చొప్పున నిధులు కేటాయించాలని కోరారు.

## కారు ఢీకొని వ్యాపారి మృతి

**జవహర్‌నగర్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** దమ్మాయిగూడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందగా, ఆయన భార్య తీవ్రంగా గాయపడింది. జవహర్‌నగర్ పోలీసుల వివరాల ప్రకారం.. నాగారం లక్ష్మీ మ్మనగర్ కాలనీకి చెందిన షేక్ నాగూర్ షరీఫ్ (59), షేక్ కరీమున్నీసా (56) బాలాజీ నగర్‌లో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో బాలాజీనగర్ నుంచి దమ్మాయిగూడ వైపు జూపిటర్ స్కూటీపై వెళ్తుండగా, దమ్మాయిగూడ ఇన్‌స్టామార్ట్ సమీపంలో ఎదురుగా వచ్చిన స్విఫ్ట్ కారు ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో దంపతులు కిందపడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు.వెంటనే వారిని దమ్మాయిగూడ ఆదిత్య ఆసుపత్రికి తరలించగా, వైద్యులు షేక్ నాగూర్ షరీఫ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కరీమున్నీసాకు తల, వెన్నుపై తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం ఈసీఐఎల్‌లోని జెనియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు, దాని డ్రైవర్ తాడి సందీప్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జవహర్‌నగర్ పోలీసులు వెల్లడించారు.

## ఉద్యోగాలకు నమోదు చేసుకోండి

..మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఉపాధి అధికారి ఎం.రాధిక

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11, ప్రభాతవార్త:**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం తెలంగాణ ఉపాధి పోర్టల్‌లో యువతీ,యువకులు పేర్లు నమోదు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా ఉపాధి అధికారిణి ఎం.రాధిక పిలుపు నిచ్చారు. మంగళవారం ఈ సందర్బంగ ఆమె మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఒక పెద్ద పారిశ్రామిక క్లస్టర్‌గా ఉందన్నారు. అనేక పరిశ్రమలు, ఐటి కంపెనీలు, లాజిస్టిక్స్ తయారీ రంగాలలో ప్రతి రోజు అనేక ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయన్నారు. జిల్లాలోని యజమానులు వివిధ ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్స్ జిల్లా కార్యాలయంకు పంపటం జరుగుతుందన్నారు. ఆ అవకాశాలకు అనుగుణంగా అర్హులైన నిరుద్యోగ యువత పూర్తి సమాచారాన్ని ఈ కార్యాలయం వద్ద కల్గి ఉండటం తప్పనిసరి అని, అందుకు జిల్లాలోని నిరుద్యోగులు తప్పనిసరిగా తెలంగాణ ఉపాధి పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఉపాధి కార్డు పొందటంతో పాటు జిల్లాలోని నిర్వహించే అన్ని రకాల అవగాహన కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలకు ఎంపిక చేసేందుకు కూడ ఈ నమోదు చేసిన డేటాను ఉపయోగించటం జరుగుతుందన్నారు. దీని ద్వారా ఉద్యోగార్దుల అభివృద్ధికి మరింత మేలు జరుగుతుందని అన్నారు. జిల్లాలోని యువత అందరు తప్పనిసరిగా ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవటానికి వెంటనే ఉపాధి పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. నమోదు విధానంను వివరించారు. వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎంప్లాయిమెంట్.తెలంగాణ.జిఒవి.ఇన్ జాబ్స్ సీకర్స్ లాగిన్‌పై క్లిక్ చేయాలని సూచించారు. క్రింది ధృవపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఎస్ఎస్‌సి మెమో, బోనాఫైడ్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, నివాస ధృవపత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, అర్హతలకు తగిన ఉద్యోగాలను సిఫారసు చేసేందుకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణలో పాల్గొనేందుకు ఈ అవకాశాన్ని జిల్లా యువత అందరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎం.రాధిక కోరారు.


మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఉపాధి అధికారిణి

## ఎస్ఎస్ఆర్ ప్రక్రియ పూర్తి

కోటపల్లి మండలంలో 81.95 శాతం ఓటర్ల నమోదు

**కోటపల్లి, ఆగస్టు 11:** వికారాబాద్ జిల్లా కోట్ పల్లి మండల కేంద్రంలో ఎస్ఎస్ఆర్ (స్పెషల్ సమ్మరీ రివిజన్) ప్రక్రియ పూర్తయిందని తహసీల్దార్ ఆనందరావు తెలిపారు. మంగళవారం కోట్ పల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందన్నారు



మండల వ్యాప్తంగా మొత్తం 21,584 మంది ఓటర్లకు గాను 17,633 మంది ఓటర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. మిగిలిన 3,951 మంది ఓటర్లలో డిలీట్ చేయాల్సిన ఓటర్లు, మరణించిన వారి వివరాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం తొలగింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఎస్ఎస్ఆర్ ప్రక్రియలో మండల వ్యాప్తంగా 81.95 శాతం ఓటర్ల నమోదు పూర్తయిందని. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# మధుసూదన్‌రెడ్డి స్ఫూర్తితో అభివృద్ధికి బాటలు

**శామీర్‌పేట, ఆగస్టు 11, ప్రభాతవార్త :** మూడుచింతలపల్లి మాజీ సర్పంచి, విద్యాసేవాతత్పరుడు కామిడి మధుసూదన్‌రెడ్డి సేవలు చిర స్మరణీయమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలో మధుసూదన్‌రెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మాజీ ఎంపిపి కామిడి మణెమ్మ మధుసూదన్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వారి కుమారుడు, వ్యవస్థాపక అధ్యక్షులు కామిడి వెంకటనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో యువకులకు స్మారక క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ కామిడి కుటుంబీకులు ఈ ప్రాంతానికి ఎంతో పేరు తెచ్చి పెట్టారని, గ్రామాభివృద్ధికి అవిరళ కృషి చేశారని అన్నారు. ప్రజల్లో నిలిచి మంచి గుర్తింపును పొందిన వారిని ఆదర్శంగా తీసుకుని అభివృద్ధిలో ముందుకు సాగాలని సూచించారు. మాజీ సిఎం కెసిఆర్ మూడుచింతలపల్లితో పాటు మరో నాలుగు గ్రామాలను దత్తత తీసుకుని సుమారు 60కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. విద్యార్థులు నూతన టెక్నాలజీని, స్కిల్స్‌ను పెంపొందించుకుని ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కేశవరం జూనియార్ కళాశాలకు చెందిన ఇంటర్, టెన్త్‌లో మెరిట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమోంటోలను ఎమ్మెల్యే మల్లారెడ్డి అందజేశారు. కామిడి కుటుంబాన్ని ఆదర్శంగ తీసుకుని అభివృద్ధిలో ముందుకు


చిత్రంలో మున్సిపల్ చైర్మన్ జాము రవి, ట్రస్ట్ వ్యవస్థాపకులు కామిడి వెంకటనర్సింహ్మారెడ్డి తదితరులు

వెళుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ జాము రవి తెలిపారు. డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కోల అంజయ్య, డిసిఎంఎస్ మాజీ వైస్‌చైర్మన్ వంగ పెంటారెడ్డి, కౌన్సిలర్ ఆర్.నీరజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. క్రికెట్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన కేశ్వాపూర్ టీమ్‌కు రూ.20,116, రన్నర్‌గా నిలిచిన పొన్నాల్ టీమ్‌కు రూ.10,116 చొప్పున

# రికార్డు స్థాయిలో సంక్షేమ పథకాల ఫలాలు

**ఆమనగల్లు, ఆగస్టు 11, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి తోపాటు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు చరిత్రలను తిరగరాస్తున్నాయని, దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, గృహాలక్ష్మీ పథకం క్రింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే సిలిండర్‌తోపాటు మహిళాసంఘాలకు తోడ్పాటునందిస్తూ రైతన్నలకు వెన్నుదన్నుగా ఉంటున్నారని కొనియాడారు. ఈసందర్బంగా ఆమనగల్లు, తలకొండపల్లి, మాడుగుల, కడ్తాల మండలాలకు చెందిన పలువురులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే తన నివాసంలో లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న పేద మధ్యతరగతి వర్గాల ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా విరివిగా ఆర్థిక సహాయం అందజేసి కార్పొరేట్ వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం తోపాటు సీనియర్ నాయకులు దోకూరి ప్రభాకర్‌రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాజానికి ఉపయోగపడే శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** విద్య అనేది కేవలం జ్ఞానాన్ని పొందే ప్రక్రియ మాత్రమే కాదని సామర్థ్యాలు, విలువలు సమాజానికి ఉపయోగపడే వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసే ప్రక్రియ అని నల్ల మల్లారెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి నల్ల మల్లారెడ్డి అన్నారు. పోచారం డివిజన్ కాచవాని సింగారంలోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా ప్రవేశించిన బీటెక్ విద్యార్థుల కొరకు ఓరియేంటేషన్ ప్రోగ్రామ్ మంగళవారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎన్‌వి. రమేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడుతూ కంప్లీట్ ఇన్‌స్టిట్యూషన్ కంప్లీట్ ఎడ్యుకేషన్ ప్రస్తావిస్తూ విద్యార్థులను బహుముఖ ప్రజ్ఞ కలిగిన నిజాయితీ గల సమర్ధవంతమైన నిపుణులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు బాషా ప్రవీణ్యం, సమర్ధవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు వృత్తి జీవితంలో ఎంతో కీలకమని అన్నారు. కళాశాల చైర్‌పర్సన్ కేతిరెడ్డి సంధ్యావళి మాట్లాడుతూ విద్యా నైపుణ్యాలతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల యాజమాన్యం కట్టుబడి ఉందని అన్నారు. కళాశాల డైరెక్టర్ నల్ల దివ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యలో ఆచరణాత్మకతకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తాము నేర్చుకుంటున్న అంశాల ఉద్దేశ్యాన్ని



మాట్లాడుతున్న ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మల్లారెడ్డి

ప్రశ్నించుకోవాలని, పరిష్కరించాల్సిన సమస్యను అర్థం చేసుకోవాలని అన్నారు. ఇంజినీరింగ్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి సమర్థవంతమైన పరిష్కారాలను రూపొందించాలని సూచించారు. ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, కమ్యూనికేషన్‌లతో పాటు తరగతి గదికి వెలుపల అభ్యసనానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్యా ప్రయాణానికి ఈ కార్యక్రమం నాంది పలుకుతుందని అధ్యాపకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యంతో పాటు డైరెక్టర్లు, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోండి

**కొడంగల్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని, అందులో భాగంగా విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులను అందిస్తున్నారని.. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని లక్ష్య సాధనతో ముందుకు వెళ్ళాలని మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ అన్నారు. మంగళవారం స్దానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌తో కలిసి మహిళా సంఘాల సభ్యులు కుట్టిన యూని ఫాంలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల మహిళలు ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వాములై విద్యార్థుల కోసం యూనిపాంలను తయారు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పథకం ద్వారా విద్యార్థులకు అవసరైన యూని ఫాంలు అందంతో విద్యార్దులు, విద్యార్దుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ శంకర్‌నాయక్, మున్సి పల్ కౌన్సిలర్ కృష్ణంరాజు, మార్కెట్


విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

కమిటీ డైరెక్టర్ ఆసీఫ్‌ఖాన్,కస్తూర్‌పల్లి సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్‌లతో పాటు మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార వ్యవస్థ బలోపేతానికి కృషిచేయాలి


సభ్యత్వం స్వీకరిస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** సహకార సంఘాల్లో స్వయం ప్రతిపత్తి, ప్రజాస్వామ్య నిర్వహణను రాజ్యాంగం ప్రోత్సహిస్తోందని, 97వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి అనుగుణంగా సహకార సంఘాలను ప్రజాస్వామ్యపద్ధతిలో నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు సభ్యులు ఎన్నుకున్న పాలకవర్గాలతో ప్రజాస్వామ్యబద్ధంగా నడవాల్సి ఉండగా, ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతిలో కాంగ్రెస్ కార్యకర్తలకు పాలకవర్గ పదవులు కట్టబెట్టడం ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీయడమేనని ఆయన ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ శివాలయం వద్ద మంగళవారం ఎదులాబాద్ రైతు పరస్పర సహకార పొదుపు సంఘం 10వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్బంగా సంఘం అధ్యక్షులు కంట్లం గౌరీశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుదర్శన్‌రెడ్డి సంఘంలో సభ్యత్వం స్వీకరించారు. పొదుపు సంఘం గత 10 సంవత్సరాలుగా చేపడుతున్న పొదుపు, ఆర్థిక సహకారం, ప్రోత్సాహం, ఋణాలకు సంబంధించిన విషయాలను సమావేశంలో తెలియజేశారు. ఎదులాబాద్ డివిజన్ పరిధిలోని ఎదులాబాద్, ఘణాపూర్, మర్రిపల్లిగూడెం, మాదారం, కొత్తగూడెం, అవుషాపూర్, అంకుశాపూర్‌లకు చెందిన రైతులు, ప్రజలు సంఘంలలో సభ్యత్వం తీసుకోవాలని అధ్యక్షులు గౌరీశంకర్ కోరారు. ఈసందర్బంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, సహకార సంఘాల్లో సభ్యుల ఓటుతో పాలకవర్గాలను ఎన్నుకునే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు.

తెలంగాణ సహకార సంఘాల చట్టం, 1964 ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, సభ్యులు ఎన్నుకున్న పాలకవర్గాలతో సంఘాలను నిర్వహించాల్సి ఉండగా, ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతిలో కాంగ్రెస్ కార్యకర్తలను పాలకవర్గాల్లో నియమించడం చట్ట స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఎన్నికలు లేకుండా కొనసాగుతున్న నామినేటెడ్ పాలకవర్గాల నియామకాలను ప్రభుత్వం వెంటనే సమీక్షించి, చట్టబద్ధత లేని పాలకవర్గాలను రద్దు చేసి, ఎన్నికలు జరిగే వరకు తాత్కాలికంగా ప్రత్యేక అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం రైతులను, సహకార సంఘాల సభ్యులను మోసం చేయడమేనని అన్నారు. సొసైటీలకు వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి, సభ్యులు ఎన్నుకున్న పాలకవర్గాలకు బాధ్యతలు అప్పగించాలని సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రైతు సమాఖ్య అధ్యక్షులు ముద్దం సంజీవరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయులు, మాజీ అధ్యక్షులు మల్లారెడ్డి, మాజీ ఎంపిటిసి గట్టగల రవి, ఎదులాబాద్ రైతు పరస్పర సహాయక పొదుపు సంఘం ఉపాధ్యక్షులు కె.ప్రభాకర్‌చారీ, కార్యదర్శి పూస మాణిక్యం, సహాయక కార్యదర్శి ఎర్రోళ్ల మురళీకృష్ణ, మంకం బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేస్తున్న తహసీల్దారు జగదీశ్వర్

## విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 11,ప్రభాతవార్త :** మనిషిలో పట్టుదల ఉంటే సాదించలేనిది ఏమి లేదని తహసీల్దారు జగదీశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైజిన్ సంస్థ తరఫున విద్యార్థులకు యూనిఫామ్స్, మాస్క్, హైజీన్ కిట్స్‌ల పంపిణి చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతి కోసం సహకారం అందిస్తున్న హైజిన్ సంస్థ వారిని ఆయన అభినందించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్ శ్వేతా చంద్రబాబు, ఎంఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ హజారలి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునిత, పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) చైర్మన్ లక్ష్మి ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దామోదర్, యాజజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య

**పరిగి టౌన్, ఆగస్టు11, ప్రభాతవార్త :** పరిగి టౌన్‌లోని మున్నూరువాడకు చెందిన 23 ఏళ్ల యువకుడు సీటుపల్లి శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శ్రీకాంత్ సోమవారం సాయంత్రం వ్యక్తిగత ఖర్చుల కోసం తల్లి సక్కమ్మను అడిగి రూ.100 తీసుకున్నాడు. రాత్రి 8 గంటలకు ఇంటికి తిరిగి వచ్చి భోజనం చేసి నిద్రించాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శ్రీకాంత్ మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.


హర్ ఘర్ తిరంగా సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

## ప్రతి కార్యకర్త దేశభక్తిని చాటాలి

**నందిగామ, ఆగస్టు 11, ప్రభాతవార్త :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటి జాతీయ ఐక్యతను చాటుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి ఇస్నాథ్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నందిగామ మండల కేంద్రంలో నందిగామ మండల అధ్యక్షులు వడ్ల అరవింద్ చారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ దేశ ఐక్యత, దేశ భద్రత, దేశ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగు తున్నారు అన్నారు. ప్రతి కార్యకర్త తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేసి జాతీయ గౌరవాన్ని, దేశభక్తిని చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు మోహన్ సింగ్ నాయక్, మండల మాజీ అధ్యక్షులు సుధాకరప్ప, సీనియర్ నాయకులు ప్రభాకర్ చారి, మండల ప్రధాన కార్యదర్శులు హేమంత్ నాయక్, ఎనికిరాల నరసింహ గౌడ్,మండల ఉపాధ్యక్షులు,కృష్ణమోహన్ గుప్తా, జంగయ్య, శ్రీనివాస్ రెడ్డి,సీనియర్ నాయకులు బి మెండే మల్లేశ్ యాదవ్, వెంకటేష్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, రాజశేఖర్ యాదవ్, బాల్చెట్టి సురేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

## స్వచ్ఛందంగా 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్

తాటిగడ్డ తండా యువకుల ఆదర్శం

**నందిగామ, ఆగస్టు 12, ప్రభాతవార్త :** మాతాండాలో మా రాజ్యం.. కోపాలు తాపాలు పక్కన పెట్టి కలిసి ఉంటాం..ప్రగతిలో ముందుంటామని నిరూపించారు తాటి గడ్డ తండాకు చెందిన వార్డు సభ్యులు జటావత్ రాజేష్, జటావత్ మాధవి లక్ష్మణ్ నాయక్ లు. ఎప్పుడు సర్పంచ్ పై కస్సు బుస్సు మనే ఈ ఇద్దరు యువనేతలు సర్పంచ్‌తో చేతులు కలిపి తాటిగడ్డ తండాలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకొని తండాకు వెలుగులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీందర్ నాయక్ ,వార్డు సభ్యులు బుజ్జి శంకర్ , శాంతి శ్రీను, పాత్లవత్ శ్రీను, మెగావత్ నాగేష్, గ్రామస్తులు రామ్మోహన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## సమయానికి బస్సులు నడపండి


చెంగిచర్ల డిపో సూపరింటెండెంట్ లక్ష్మీకళ్యాణికి వినతిపత్రం అందజేస్తున్న మురళీ

**ఘట్‌కేసర్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌కు ఆర్టీసీ బస్సులు సక్రమంగా నడపాలని మాజీ వార్డుసభ్యులు-బిజెపి బూత్ అధ్యక్షులు ఎర్రోళ్ల మురళీకృష్ణ మంగళవారం చెంగిచర్ల డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. సమయానికి అనుగుణంగా బస్సులు రాక రోజువారీ ప్రయాణికులు, విద్యార్థులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదురొంటున్నారని తెలిపారు. ఈమేరకు డిపోలో ఆఫీసు సూపరింటెండెంట్ కళ్యాణలక్ష్మిని కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఎదులాబాద్ నుంచి నిత్యం విద్యార్థులు నగరానికి ఉదయం, సాయంత్రం సమయాల్లో రాకపోకలు సాగిస్తున్నారని స్కూల్, కళాశాలకు వెళ్లే సమయంలో బస్సులు రాక ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. గతంలో ఎదులాబాద్ నుండి బస్సులు ఉదయం 6 గంటలకు, 8:10 గంటలకు, తిరుగు ప్రయాణాల కోసం సాయంత్రం 7 గంటలకు, 8 గంటలకు నడిచేవని ప్రస్తుతం ఆసమయాల్లో బస్సులు రావడం లేదని తెలిపారు. ఎదులాబాద్ మీదుగా నిలిపివేసిన ఉదయం 9:30 గంటల బస్సు సర్వీసును పునఃప్రారంభించాలని, బస్టాండ్‌లో శాశ్వత బస్సు సమయ సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కంట్లం గౌరీశంకర్, వి.రామాంజనేయులు, బిజిలి కుమార్, పరమేష్, రాములు, శంకర్, శివపాల్, కృష్ణ, బాలయ్య, రవికిరణ్, గోపాల్, ఉప్పు రాజు, నర్సింహ్మా తదితరులు సంతకాలు చేసిన పత్రాన్ని ఆమెకు అందజేశారు.

## చేయూత పింఛన్ దరఖాస్తుల ఆహ్వానం

**యాచారం,ఆగస్టు 12, ప్రభాతవార్త:** చేయూత పింఛన్ల కోసం దరఖాస్తులు అవమానిస్తున్నట్లు యాచారం ఎంపీడీవో రాధారాణి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ .. వితంతువులు ఒంటరి మహిళలు వికలాంగులు గీత కార్మికులు నేతా కార్మికులు ఫైలేరియా వ్యాది గ్రస్తులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వితంతు పింఛన్ల కోసం 18 సంవత్సరాల నుండి భర్త మరణ ధ్రువీకరణ పత్రంతోపాటు 1,50,000 ఆదాయపు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని అన్నారు. ఒంటరి మహిళల పింఛన్ల కోసం 18 సంవత్సరాలు నిండిన విడాకుల పత్రం మండల రెవెన్యూ అధికారి ధీకరణతో 1,50,000 లోపు ఆదాయం కలిగి ఉండాలన్నారు.

## న్యాయమైన పరిహారం కోసం సమిష్టిగా తీర్మానం


సమావేశమైన బాధిత రైతులు

**యాచారం,ఆగస్టు11, ప్రభాతవార్త :** ప్రభుత్వం భూముల సేకరణ కోసం చేపడుతున్న యాచారం మండలం మొండి గౌరెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామ ప్రజలు, రైతులతో భారీ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ శ్రీకోలన్ రమాదేవి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భూసేకరణ వల్ల రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా త్వరలోనే స్థానిక ప్రజాప్రతినిధులను, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, బాధితులు పలు ప్రధాన డిమాండ్లను తెరపైకి తెచ్చారు. పెరిగిన మార్కెట్ విలువల ప్రకారం రైతులకు నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం రికార్డుల ప్రకారమే కాకుండా, ప్రస్తుతం రైతుల కబ్జాలో ఉన్న పూర్తి విస్తీర్ణానికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తూ పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే గతంలో స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చిన అదనపు ప్లాటు విషయమై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని నిలదీశారు. వివాదాస్పదంగా మారిన 19, 68, 127 మూడు సర్వే నెంబర్లకు విడివిడిగా కాకుండా, ఒకేసారి అవార్డు పాస్ చేసి పరిహారం అందించాలని స్పష్టం చేశారు. ఈ మహాసభలో గ్రామానికి చెందిన ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, ఆయా సర్వే నెంబర్ల పరిధిలోని బాధిత రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతులకు మద్దతు ప్రకటించారు.

## అధికారుల సలహాలు సూచనలు పాటించండి అధిక దిగుబడి పొందండి

**యాచారం,ఆగస్టు11, ప్రభాతవార్త..**


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి రవినాథ్

యాచారం మండల పరిధిలోని చౌదరిపల్లి గ్రామంలోని రైతు వేదికలో భవనం ఆత్మ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి ,సేంద్రీయ వ్యవసాయం, ఎలి నినో ప్రభావం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి రవినాథ్ పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సుకు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ మార్పులు, ముఖ్యంగా ఎలినినో ప్రభావం వ్యవసాయంపై చూపే నష్టాలను రైతులకు వివరిస్తూ, వీటిని తట్టుకోవడానికి ఆరుతడి పంటల సాగు ఎంతో మేలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా చౌదరిపల్లి, తులేకుర్ద గ్రామ సర్పంచులు, స్థానిక అభ్యుదయ రైతులతో శాస్త్రవేత్తలు సమావేశమై, ప్రస్తుతం గ్రామాల్లో సాగవుతున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు మేలు చేకూర్చే పలు కీలక అంశాలైన రసాయన రహిత సేంద్రీయ వ్యవసాయం, ఒకే భూమిలో బహుళ ఆదాయ వనరుల కోసం మిశ్రమ పంటల సాగు, కూరగాయలు, పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. వీటితో పాటు వ్యవసాయానికి అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, కోళ్ళ పెంపకాన్ని చేపట్టడం ద్వారా రైతులు ఆర్థికంగా ఎలా స్థిరపడవచ్చో వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌదరిపల్లి క్లస్టర్ పరిధిలోని గ్రామ ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, క్లస్టర్ పరిధిలోని రైతులు మరియు అభ్యుదయ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


హకీంపేట్ ఆర్టీసి డిపో వద్ద లాల్‌గడిమలక్‌పేట్ అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న రిక్వెస్ట్ బస్‌స్టాప్ వద్ద ఆర్టీసి బస్సులు ఆపటం లేదని కౌన్సిలర్, నాయకులు, కాలనీవాసులు, మహిళలు చేరుకుని ఆందోళన వ్యక్తం చేసిన దృశ్యం

హకీంపేట్ ఆర్టీసి డిపో వద్ద లాల్‌గడిమలక్‌పేట్

## అంబేద్కర్ కాలనీవాసుల ఆందోళన

**శామీర్‌పేట, ఆగస్టు 11, ప్రభాతవార్త:** హకీంపేట్ ఆర్టీసి డిపో వద్ద లాల్‌గడిమలక్‌పేట్ అంబేద్కర్ కాలనీ వాసులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట్ అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న రిక్వెస్ట్ బస్‌స్టాప్ వద్ద ఆర్టీసి బస్సులు ఆపకపోవటంతో పాటు ఆ బస్సుల డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణీకులతో దురుసుగా మాట్లాడు తున్నారని హకీంపేట్ ఆర్టీసి డిపో మేనేజర్‌కు ఆ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గత నెల 20వ తేదీన హకీంపేట్ ఆర్టీసి డిపో మేనేజర్‌కు ఆర్టీసి బస్సులు ఆపటం లేదని వినతిపత్రం అందజేశామని చర్యలు తీసుకుంటామని డిఎం చెప్పినా.. అయినా ఆర్టీసి బస్సులు కాలనీ బస్‌స్టాప్ వద్ద ఆపటం లేదని, ఆపకపోవటంతో పాటు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయా ణీకుల పట్ల దురుసుగా మాట్లాడటంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై హకీంపేట్ డిపో మేనేజర్‌ను కలిసి కాలనీ వద్ద ఆర్టీసి బస్సులు ఆపాలని కోరగా బస్సులు ఆపటానికి తగు చర్యలు తీసుకుంటామని, దురుసుగా మాట్లాడే డ్రైవర్‌ల,కండక్టర్లపై తగు చర్యలు తీసుకుంటామని డిఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కైర గణేశ్, మాజీ సర్పంచు కైర రమేశ్‌తో పాటు బిజెపి నాయకులు యాదగిరి, పలువురు మహిళలు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాను అరికట్టండి

**వికారాబాద్,ప్రభాతవార్త :** యాలాల మండల పరిధిలో చేపడుతున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని యాలాల మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిద్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ, యాలాల మండల పరిధిలోని కక్రవేణి నదీ పరివాహక ప్రాంతంలో కొంతమంది అక్రమంగా పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నారని, అధికారులు ఏ ఒక్క రోజు వారిని పట్టుకున్న దాఖలాలు లేవని అన్నారు. జూన్ మొదటి వారం నుంచి శివసాగర్ ప్రాజెక్టు కేంద్రంగా ఇప్పటి వరకు వేల లారీల ఇసుకను 8 ఇటాచీల సహాయంతో తరలించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. అదీ చాలదు అన్నట్లుగా విశ్వనాథ్‌పూర్ సమీపంలోని కక్రవేణి నదీ నుంచి ఇసుక రవాణాకు తెరలేపారని పేర్కొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి బయటకు వస్తున్న యాలాల మండల నాయకులు, ప్రజలు

ఎల్‌నీనా ప్రభావంతో వర్షాలు సైతం ఆశించినస్థాయిలో కురవకపోవడంతో భూగర్భ జలాలు సైతం అడుగంటాయని, ఇసుకాసురుల వల్లన భూగర్భ జలాలు మరింత అడుగంటే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక కారణంగా యాలాల్, సంగెంఖుర్దు, విశ్వనాథ్‌పూర్, రాఘవపూర్, దేవనూర్, దుబ్బతాండ, గోరెపల్లి, నాగసముందర్, కమలాపూర్, తదితర గ్రామాలకు తాగు, సాగు నీటి కి ఇబ్బంది కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జ్యూలజీ సర్వే కూడా ఇసుక రీచ్ లేదని చెబుతున్న 20 నుంచి 30 ఫీట్ల వరకు ఇసుకను తోడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక దళారులు, కాంట్రాక్టర్ల మోసపూరిత చర్య వల్ల భవిష్యత్తులో స్థానిక ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, వెంటనే అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

# మొయినాబాద్‌లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ..





**మొయినాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** హర్ ఘర్ తిరంగా జాతీయ అభియానంలో భాగంగా బీజేపీ మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ర్యాలీ జాతీయ జెండాలతో దేశభక్తి నినాదాల మధ్య కొనసాగింది. ర్యాలీలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు కుండే గణేష్, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, రాష్ట్ర సీనియర్ నాయకుడు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ కావలి శ్రీశైలం యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పడమటి మమత మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ర్యాలీని విజయవంతం చేశారు. టి. శ్రీనివాస్‌గౌడ్, ఎ. శ్రీనివాస్‌గౌడ్, మోరా నరసింహారెడ్డి, బకారం సర్పంచ్ వెంకటేష్‌గౌడ్, షాపురం మణిక్యం, ఏర్పుల మైపాల్, షాపురం శ్రీకాంత్, మాదాపురం శ్రీకాంత్, కౌన్సిలర్ కిసాన్, జగపతి, క్యమ పద్మనాభం, ప్రభాకర్‌రెడ్డి, సురేంద్ర, పల్లె శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**దేశభక్తి చాటాలి..**

జాతీయ పతాకం పట్ల గౌరవం, దేశ సమైక్యత, దేశభక్తి భావాలను ప్రతి ఒక్కరిలో పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాయనోళ్ల రవీందర్‌యాదవ్, తిరంగా ర్యాలీ అసెంబ్లీ కన్వీనర్ నందకిషోర్, మండల కన్వీనర్ మహేందర్ ముదిరాజ్, కోకన్వీనర్ కోరే రామకృష్ణ సమన్వయం చేశారు.

## పారదర్శక ప్లాట్ల కేటాయింపుపై భూనిర్వాసితుల సంబురాలు

**దుద్యాల్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలాలు అందడంతో హకీంపేట్‌లో భూనిర్వాసిత రైతులు సంబరాలు చేసుకున్నారు. హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్ భూనిర్వాసిత రైతులు సిఎం రేవంత్‌రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి పాలాభిషేకం చేశారు. లక్కీడ్రా ద్వారా పారదర్శకంగా ప్లాట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్లాట్ల కోసం ఎవరూ తమను డబ్బులు అడగలేదని, తాము ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని రైతులు స్పష్టం చేశారు. హకీంపేట్ సర్పంచ్ రవీంద్ర నరసింహారెడ్డి, పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో రైతులు డప్పులతో ర్యాలీగా ప్రధాన కూడలికి చేరుకుని పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూమికి ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఎకరాకు 150 గజాల చొప్పున ఇంటి స్థలాలు కేటాయించారని తెలిపారు. తమ సమక్షంలోనే లక్కీడ్రా నిర్వహించడం వల్ల కేటాయింపుల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పోయిందన్నారు.

సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. కొందరు రైతుల భూముల విస్తీర్ణంపై చేసిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు. హకీంపేట్ ప్రధాన రహదారికి ఆనుకుని 38 ప్లాట్లు ఏర్పాటు చేయగా 36 ప్లాట్లను లక్కీడ్రా ద్వారా కేటాయించామని, కాలువ, బావి తదితర కారణాలతో రెండు ప్లాట్లు మాత్రమే మిగిలాయని వివరించారు. సుమారు 900 ఎకరాల భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు 150 గజాల చొప్పున ప్లాట్లు కేటాయించామని తెలిపారు. రాజకీయ విమర్శల కోసం రైతులను రెచ్చగొట్టేలా అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న భూ నిర్వాసితులు

కార్యక్రమంలో వెంకటరాములు గౌడ్, రామచంద్రారెడ్డి, నరసింహులు నాయుడు, యుగంధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బ్యాగరి నరసింహ, రవి నాయక్, సింగర్ నరసింహ, చాకలి శ్రీనివాస్ తదితరులతో పాటు మూడు గ్రామాలకు చెందిన భూనిర్వాసిత రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొబైల్ కోసం తల్లితో గొడవ

## బాలుడు అదృశ్యం

**శంషాబాద్, ఆగస్టు 11,ప్రభాతవార్త :** మొబైల్ ఫోన్ విషయంలో తల్లితో గొడవపడి 11 ఏళ్ల బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. డ్రీమ్ అవెన్యూకు చెందిన ఇబ్రహీం మొల్లా సోమవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బాలుడి ఎత్తు సుమారు 4.5 అడుగులు, నలుపు ఛాయతో ఉంటాడు. నీలం టీషర్ట్, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. హిందీ, బెంగాలీ మాట్లాడగలడు. ఆచూకీ తెలిసినవారు ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఫోన్ 8712663319, 8712663311లను సంప్రదించాలని పోలీసులు కోరారు.


బాలుడి (ఫైల్ ఫోటో)

## పెరిగిన సిసి బిల్లుల భారం

**-విడతలవారీగా చెల్లించే అవకాశం కల్పించాలని ఎంపీడీఓకు సర్పంచుల వినతి**

**-ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దీష్టిలో ఉంచుకొని వెసులుబాటు కల్పించాలని కోరిన సర్పంచులు**


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న మండల సర్పంచులు

**దౌల్తాబాద్, ఆగస్టు 11,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలో సీసీ బిల్లులు చాలా ఎక్కువగా రావడం జరిగిందని,ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆ బిల్లులను విడతలవారీగా చెల్లించడానికి అవకాశం కల్పించాలని కోరుతూ మండల సర్పంచులు మంగళవారంరోజు మండల ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా సర్పంచులు మాట్లాడుతూ..ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న ఆర్థిక ఇబ్బందుల వల్ల భారీ మొత్తంలో ఒకేసారి సీసీ బిల్లులు చెల్లించడం ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, సర్పంచ్‌లకు ఇబ్బంది కలగకుండా విడతలవారీగా చెల్లించేలా వెసులుబాటు కల్పించాలని వారు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు సర్పంచులు పాల్గొన్నారు.


ఎదులాబాద్‌లో విశ్వశాంతియాగం నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా 21వ విశ్వశాంతియాగము

**ఘట్‌కేసర్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లోని శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి దేవాలయంలో మంగళవారం 21వ విశ్వశాంతియాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ యజ్ఞ నిర్వహణకర్త కంట్లం గౌరీశంకర్ ఆధ్వర్యంలో ప్రతినెల మాసశివరాత్రి రోజున లోకకళ్యాణార్థం విశ్వశాంతి యాగం నిర్వహిస్తున్నారు. మల్లి ఖార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ ఆవరణలోని విష్ణువినాయక కళ్యాణ మండపంలో విశ్వశాంతి యజ్ఞం నిర్వహించారు. నిర్వహకులు కంట్లం గౌరీశంకర్, కళావతి దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేశారు. అర్చకులు కుమారస్వామి మంత్రోచ్చారణాల మధ్య విశ్వశాంతిహోమం ఘనంగా జరిపారు. ప్రకృతి వైపరీత్యాలు తొలగిపోవాలని, దేశంలో సుభిక్షం, వర్షాలు సమృద్ధిగా కురవాలని, మానవ సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనాలనే సదుద్దేశంతో ఆపరమేశ్వరున్ని వేడుకుంటూ ప్రతినెలా యాగం చేస్తున్నామని గౌరీశంకర్ తెలిపారు. అనంతరం భక్తులకు పంచామృత తీర్థ ప్రసాద వితరణ చేశారు.

### ఫార్మాసిటీ భూబాధిత రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు

**యాచారం, ఆగస్టు11, ప్రభాతవార్త..** ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన అసైన్డ్ రైతులు, ఎలాంటి సర్టిఫికెట్లు లేకుండా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కబ్జా రైతులు, మరియు పట్టా రైతులకు ప్రభుత్వం పరిహారంతో పాటు అదనంగా ఎకరాకు 121 గజాల చొప్పున అన్ని రకాల వసతులతో కూడిన లేఅవుట్ ప్లాట్లను కేటాయించిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వం మొదట్లో వీరికి ఫార్మా ప్లాట్ల సర్టిఫికెట్లను అందజేసింది. అయితే, ఈ సర్టిఫికెట్లు ఇచ్చినప్పటి నుండి కొందరు రియల్ ఎస్టేట్ దళారులు ఒక సిండికేట్‌గా ఏర్పడి, అమాయక రైతుల నుండి ఒక్కో ప్లాటును కేవలం రూ. 3 లక్షలు, రూ. 4 లక్షలు, రూ. 5 లక్షలు లేదా రూ. 6 లక్షల వంటి తక్కువ ధరలకు కొనుగోలు చేశారని తెలంగాణ జనసమితి రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ సామ నిరంజన్ ఆరోపించారు. ప్రస్తుతం అదే ప్లాట్లను ఒక్కో బ్రోకర్ రూ. 30 లక్షల నుండి రూ. 40 లక్షల వరకు విక్రయిస్తూ భారీగా లాభపడుతున్నారని, తక్కువ ధరలకే ప్లాట్లను కొనుగోలు చేసి ఫార్మా భూబాధిత రైతులను దళారులు తీవ్రంగా మోసం చేశారని ఆయన మండిపడ్డారు.

## పాదయాత్రను విజయవంతం చేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గంటి సురేష్‌కుమార్**

**కొడంగల్,ఆగస్టు 11 ,ప్రభాతవార్త:** కొడంగల్‌లో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జరిగే పాయాత్రను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గంటి సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కొడంగల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం కొడంగల్‌లో అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైయ్యే సిపిఐ పాదయాత్రకు సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ ముఖ్యఅతిధిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ పాదయాత్ర చేపడు తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడంతో పాటు వాటి పరిష్కారానికి ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణి



విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణి చేసిన సర్పంచ్

**కుల్కచర్ల, ఆగస్టు11, ప్రభాతవార్త:** విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని సర్పంచ్ భూపాల్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోనిముజాహిద్‌పూర్ గ్రామ పాఠశాలలో విద్యార్థులకు ఏకరువ దుస్తులు.బుట్లు స్థానిక నాయకులతో కలిసి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఈసందర్భంగా సర్పంచ్ భూపాల్‌రావు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సురక్షితమైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను భోదించడం, నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందన్నారు.

బడిఈడు వయస్సు కలిగిన వారిని బడిలో చేర్పించాలన్నారు .ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఏడాదికి రెండు జతల ఏకరూప దుస్తులను ఉచితంగా అందజేయడం జరుగుతుందని పాఠ్యపుస్తకాలు పంపిణి చేయడం, మధ్యాహ్నభోజన పథకం అమలు చేయడంతో పాటు వారానికి మూడు సార్లు గ్రుడ్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్‌ఉప్పు నీలంబిక, మహిళ సంఘం వివో ఎండి లతిప, వార్డు సభ్యులు సర్దార్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## బహువార్షిక కంది మొక్కుల పంపిణీ

**-5 నుంచి 8 ఏళ్లపాటు కాపునిచ్చే కంది మొక్కలు అందజేత**



కంది మొక్కలను పంపిణీ చేస్తున్న వాసన్ సంస్థ సిబ్బంది

**దౌల్తాబాద్, ఆగస్టు 11,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి, చెల్లాపూర్ గ్రామాల్లో అరక రైతు ఉత్పత్తిదారుల సంఘం, మండల రైతుల సంఘం, వాసన్ సంస్థ ఆధ్వర్యంలో బహువార్షిక కంది మొక్కలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల చేతుల మీదుగా రెండు గ్రామాల్లో సుమారు 1,000 మొక్కలను రైతులకు అందజేశారు. ఈ సంధర్భంగా వాసన్ సంస్థ ప్రోగాం అసోసియేట్ సొండే.గోపాల్ మాట్లాడుతూ.. ఈ మొక్కలు 5 నుంచి 8 సంవత్సరాలవరకు కాపునిస్తాయని, వీటిని ఇంటి పరిసరాలు ,పెరట్లలో లేదా పొలాల గట్లపై పెంచుకోవచ్చని తెలిపారు. కందుల్లో ప్రోటీన్లు, పీచు పదార్థాలు, కాల్షియం అదికంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈర్లపల్లి సర్పంచ్ పద్మ, చెల్లాపూర్ సర్పంచ్ రోజా, మండల రైతు సంఘం కార్యదర్శి పల్లె వెంకటయ్య, వాసన్ సంస్థ సిబ్బంది సాయప్ప, బ్రహ్మానందం, గోవర్ధన్, రైతులు పి.సాయిరెడ్డి, మాధవరెడ్డి, శ్యామరెడ్డి, ఎ.మల్లప్ప, దేవరాజు, కోస్గి లక్ష్మప్ప, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.


ఏవోకు ఫిర్యాదు చేస్తున్న భారతీయ కిసాన్ సంఘ నాయకులు

## అధిక ధరలకు ఎరువుల విక్రయాలు

**ఏవోకు ఫిర్యాదు**

**షాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ఫర్టిలైజర్ దుకాణదారులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తుండడంతో మండల వ్యవసాయాధికారి విజయచంద్రకు భారతీయ కిసాన్ సాంగ్ నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు యాదవరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల సీజన్లో ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులను తీవ్రంగా మంచుతున్నారన్నారు రూ.1800 నుండి రూ2000 వరకు విక్రయిస్తున్నారని, బిల్లు మాత్రం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా దుకాణాలను తనిఖీ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మాజీ హోంమంత్రి దేవేందర్‌గౌడ్‌ను సత్కారం

**ఘట్‌కేసర్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** మాజీ హోంమంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్‌ను మంగళవారం ఘట్‌కేసర్ టిడిపి నాయకులు కలిశారు. తుక్కుగూడలోని ఆయన నివాసంలో నాయకులు గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్ అభివృద్ధి, పెండింగ్ పనులు, స్థానిక రాజకీయ పరిస్థితులపై వారు దేవేందర్‌గౌడ్‌తో చర్చించారు. ఈకార్యక్రమంలో ఘణాపూర్ మాజీ సర్పంచ్ వేముల సంజీవగౌడ్, టిడిపి నాయకులు సామల జగన్మోహన్‌రెడ్డి, పాటి సురేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



## అంబర్‌పేటలో సిసి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

**జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**



**హైదరాబాద్, అగస్టు 11, ప్రభాతవార్త**

అంబర్‌పేట నియోజక వర్గంలో సిసి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను చర్చించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బిటీ రోడ్లు దెబ్బతిన్నాయని, రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అందుకు జిహెచ్ఎంసి కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ అంబర్‌పేట్ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిసి భోగేశ్వర్

**అల్వాల్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** అల్వాల్ సీనియర్ సిటిజన్స్ క్రీడా పోటీలను మంగళవారం డిప్యూటీ కమీషనర్ భోగేశ్వర్ ప్రారంభించారు. అస్కా ఆధ్వర్యంలో పోటీలు మూడు రోజులు పాటు జరగనున్నాయి. దేవుని అల్వాల్‌లోని నవకళా కేంద్రం వేదికగా పోటీలు జరుగుతాయి. క్యారమ్స్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలుతో పాటుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సీనియర్ సిటిజన్లు సామాజిక సేవా కార్యక్రమాలులో పాల్గొనడంతో పాటుగా క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ నేటి తరానికి ఆదర్శవంతంగా నిలుస్తున్నారని డిసి భోగేశ్వర్ కొనియాడారు. ఆరు పదులు దాటిన వయసులో కూడా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే ఆనందయమ జీవన విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పెద్ది సురేష్, సలహాదారు పాపారావు, సంయుక్త కార్యదర్శి భాస్కరరావు, ఆడిటర్ శివకుమార్, క్రీడల ఇన్‌చార్జ్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## డిఫెన్స్ అకౌంట్స్ కంట్రోలర్‌గా అందె పోశెట్టి



లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వైష్ణయ్‌ను కలిసి సిడిఎ

**అల్వాల్, ఆగస్టు 11 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ డిఫెన్స్ అకౌంట్స్ కంట్రోలర్(సిడిఎస్)గా అందె పోశెట్టి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సిడిఎస్ మిలటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్(ఎంసిఇఎంఇ) కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వైష్ణయ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గణాంక శాఖకు చెందిన పలు విషయాలుపై ఇరువురు చర్చించుకున్నారు.

## దాతల సహకారం అభినందనీయం

**- తలారి మల్లేష్ ముదిరాజ్**



ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగ్‌లు, నోటు పుస్తకాలు అందజేస్తున్న పుర ప్రముఖులు.

**నార్సింగి, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు దాతలు చేసిన సహకారం అభినందనీయమైనదని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం గండిపేట మండలం ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గోల్కొండ రీసార్ట్ ప్రతినిధుల బృందం స్కూల్ బ్యాగ్‌లు, నోటు పుస్తకాలను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్లేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదల బిడ్డలే చదువుకుంటున్నారని, వారికి సమాజంలో ఆర్థికంగా సిర్థపడ్డ వారు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి చేతనైన సహకారం చేయాలని మల్లేష్ సూచించారు. సర్కారు బడుల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అమోఘమని, ఆంగ్లమాధ్యమంలో చదువులు చెప్పిస్తున్నారని తెలిపారు. కార్పోరేట్ విద్యాలయాల వలే నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, మూడు పూటల అల్పాహారం, భోజనం, స్నాక్స్ అందిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా, నార్సింగి సహకార సంఘం చైర్మన్ తోల్‌కట్ట కృష్ణ, గోల్కొండ రీసార్ట్ జిఎం. మేనేజర్ తదితర ప్రతినిధులు హాజరయ్యారు.

## ఎంటీఏఆర్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**చిక్కడపల్లి ఆగస్టు 11 ప్రభాతవార్త :** బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలోని ఎంటీఏఆర్ టెక్నాలజీస్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిఐటీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని, తొలగించిన 350 మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గత 13 రోజులుగా సాగుతున్న ఆందోళనలో భాగంగా మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఏ. అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పాలడుగు భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ విధానం వల్ల దేశవ్యాప్తంగా 10 లక్షల మంది కార్మికులు ఉద్యోగ భద్రత లేక అన్యాయానికి గురవుతున్నారని, ఈ విధానాన్ని రద్దు చేసి ఎంటీఏఆర్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్మిక శాఖ అధికారులు యాజమాన్యానికి కొమ్ముకాయకుండా, కార్మికుల వైపు నిలబడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్మికులకు కులం, మతం, ప్రాంతం అనే తేడాలు ఉండవని, ఐక్యపోరాటాలతోనే హక్కులను సాధించుకోవచ్చని పిలుపునిచ్చారు. ఈ పోరాటానికి సీఐటీయూతో పాటు ఇతర కార్మిక సంఘాలు అండగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ ధర్నాకు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు, బిఆర్‌టియు రాష్ట్ర నాయకులు రాంబాబు, నారాయణ పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నిత్యావసరాల ధరలు పెరిగిన వేళ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మరియు యాజమాన్యంపై ఉందన్నారు.

## యువతలో దేశభక్తి పెంపొందిస్తూ ఘనంగా రన్ ఫర్ వందేమాతరం

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 11, ప్రభాతవార్త**

భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో, జాతీయ గీతం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ వందేమాతరం విద్యార్థి దళ్ కార్యక్రమం కూకట్‌పల్లిలో దేశభక్తితో ఉత్సాహంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై యువత, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు, దేశభక్తులు జాతీయ జెండాలను చేతబూని వందేమాతరం, భారత్ మాతాకీ జై నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ యువతలో దేశభక్తి, జాతీయతా భావాలను పెంపొందించడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత మత్తుపదార్థాలకు పూర్తిగా దూరంగా ఉంటూ, విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాల వైపు అడుగులు వేయాలని సూచించారు. విద్యార్థి శక్తి దేశ శక్తి అని పేర్కొంటూ నేటి విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని అన్నారు. ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన, దేశభక్తి భావాలు కలిగిన సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షులు మోహన్ రావు, ప్రాంత సహాయ కార్యదర్శి రమేష్, బజరంగ్ దళ్ నిర్వాహకులు, బిజెపి నాయకులు జీవన్, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ చారి, శివాచారి, మహేందర్, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రన్ ఫర్ వందేమాతరం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





దేశభక్తి ర్యాలీలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

## సకల కళల జెఎసి రాష్ట్ర చైర్మన్‌గా భూపతి వెంకటేశ్వర్లు

**చిక్కడపల్లి ఆగస్టు 11 , ప్రభాతవార్త :** తెలంగాణలోని వివిధ కళారూపాలు, జానపద కళల పరిరక్షణ మరియు కళాకారుల సంక్షేమమే ధ్యేయంగా సకల కళల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నిరంతరం పోరాడుతుందని జేఏసీ నూతన రాష్ట్ర చైర్మన్ భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో సకల కళల జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలో జానపద కళల అభివృద్ధికి ఖితెలంగాణ జానపద అకాడమీఖి, ఖితెలంగాణ జానపద యూనివర్సిటీఖిని తక్షణమే ఏర్పాటు చేయాలి. కళాకారులందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు అర్హులైన వారికి ఈ నెల 15 నుంచే వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలి. కనుమరుగవుతున్న జానపద కళలను కాపాడేందుకు, కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని తీసుకురావాలి .కళాకారుల హక్కులు, జానపద అకాడమీ, యూనివర్సిటీ సాధన కోసం సెప్టెంబర్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టనున్నట్లు భూపతి వెంకటేశ్వర్లు వెల్లడించారు. జేఏసీ గౌరవ అధ్యక్షులుగా సంకె రాజేష్, సాదు మహారాజు రఘోత్తమాచార్యులు, గౌరవ సలహాదారుగా ఒరుగంటి కొమురయ్య, రాష్ట్ర చైర్మన్ గా భూపతి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కన్వీనర్ గా వలస సుభాష్ చంద్రబోస్, కోకన్వీనర్లు గా నడిమింటి శ్రీనివాస్, మహమ్మద్ పాషా, దేవేందర్ రావు, కో ఆర్డినేటర్లు గా గాండ్ల నర్సయ్య, గంగాధర్ సత్తయ్య, జంగిలి లచ్చన్న, ఇమ్మడి ఎల్లన్న, దంతాలపల్లి సోమయ్య, యం. నాగయ్య తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సకల కళల జేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా భూపతి వెంకటేశ్వర్లు తదితరులు

## మాలలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీని గద్దె దించాలి : పబ్బతి శ్రీకృష్ణ

**సైఫాబాద్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది మాలలకు తీరని అన్యాయం చేసిన సిఎం రేవంత్‌రెడ్డిని గద్దె దించడం ద్వారానే మాల మృతవీరులకు నిజమైన నివాళి అర్పించినట్లని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.పబ్బతి శ్రీకృష్ణ చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1997 ఆగస్టు 11న మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు పిలుపు మేరకు లక్షలాది మంది మాలలు చలో సచివాలయం ముట్టడి కార్యక్రమంలో అసువులు బాసిన గోపతోటి నారాయణ, పాణింగి శేషయ్య, రెడ్డి సుదర్శన్‌ల చిత్రపటాలకు మంగళవారం ఎస్ఎస్ఎస్‌లో నివాళులు అర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్గీకరణ వల్ల ఒక్క మాలలకే కాదని ఎస్సీలోని అన్ని కులాలకు అన్యాయం చేసిన రేవంత్‌రెడ్డి సర్కార్, ఎపి సిఎం ఎన్. చంద్రబాబునాయుడు సర్కార్‌కు రాజ్యాంగ నిర్మాత ఇచ్చిన ఓటు హక్కు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని ఉభయ తెలుగు రాష్ట్రాలలోని మాలలకు ఆయన పిలుపునిచ్చారు. ఎంపి మల్లు రవి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మొదటి నుంచి విభీషణ పాత్రను పోషిస్తూ మాల కులాన్ని నాశనం చేస్తున్నారని, ఇందులో భాగంగా కొంత మంది బ్రోకర్లు మల్లు రవి, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కలువడం ధర్నాల పేరుతో మాలల వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి మాలలు ఓట్లు వేయరాదని తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు వినయ్‌కుమార్, శేఖర్, అంబేద్కర్ సేన నాయకుడు మన్నె శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



పి.వి.రావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పబ్బతి శ్రీకృష్ణ

## ఘాన్సీబజార్‌లో పర్యటించిన ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ



ఘాన్సీ బజార్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ,ఎమ్మెల్సీ మీర్జారెహ్మత్ బేగ్,చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సత్యనారాయణ

**చార్మినార్,ఆగస్టు 11 ప్రభాతవార్త :** చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఘాన్సీ బజార్ డివిజన్‌లో మంగళవారం చార్మినార్ నియోజకవర్గం ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ,ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ బేగ్,జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కె. సత్యనారాయణ పలు విభాగాల అధికారులు విస్తృతంగా పర్యటించారు.గుల్జారాహౌస్,ఉర్దూగల్లీ క్లాథ్ మార్కెట్ ప్రాంతాలలో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ,గుంతలు మయంగా మారిన రహదారులు,చెడి పోయిన మ్యాన్ హోల్స్‌లను వారు పరిశీలించారు.బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చార్మినార్ నియోజకవర్గం ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ మాట్లాడుతూ.డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచి మురుగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ శుభ్రం చేసే పనులు,మురుగు నీటి ప్రవాహాన్ని సరిచేసే అవసరమైన మరమ్మతుల పనులనుతక్షణమే చేపట్టాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జోనల్ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రాంబాబు.జలమండలి సిజిఎం జాన్ షరీఫ్,జలమండి డిఈలు,ఏఈఈలుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలి



**అత్తాపూర్ ఆగస్టు11,ప్రభాతవార్త :**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి బిజెపి డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్‌లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ ఐక్యత, అఖండ భారత స్ఫూర్తిని ప్రజల్లో మరింత బలపరచడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు జోగి రవి ,అరాజు ,అ మహేందర్, బల్ల శ్రీనివాస్ యాదవ్, గూడూరి అంజి ,కొండల, సురేశ్ యాదవ్ , నవీన్ , రాతిక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోడుప్పల్‌లో నకిలీ కేకుల తయారీపై ఎస్‌ఓటి పోలీసుల దాడి



బోడుప్పల్ మల్లికార్జుననగర్‌లో కేకుల తయారీకి ఉపయోగించిన రసాయనాలు స్వాధీనం చేసుకున్న దృశ్యం.

**ఉప్పల్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** కేకుల తయారీలో నిబంధనలకు విరుద్ధంగా హానికరమైన, కాలం చెల్లిన పదార్థాలను వినియోగిస్తున్న ఒక బేకరీపై ఉప్పల్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి బోడుప్పల్ రోడ్డులోని మల్లికార్జునగర్‌లో ఉన్న అమ్నాన్స్ గల్ఫ్ బేకరీలో సోమవారం ఎస్‌ఓటి పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో కేకుల తయారీకి ఉపయోగిస్తున్న అమోనియా పొడి, నిమ్మ పసుపు కృత్రిమ ఆహార రంగు, నారింజ ఎరుపు కృత్రిమ ఆహార రంగుతో పాటు ఇతర కృత్రిమ రంగులను పోలీసులు గుర్తించారు. అలాగే కాలం చెల్లిన రమ్మామిక్ పొడి, వాటిని ఉపయోగించి తయారు చేసిన కేకులను స్వాధీనం చేసుకున్నారు. బేకరీలో పరిశుభ్రతా ప్రమాణాల పాటించకపోవడాన్ని కూడా పోలీసులు గుర్తించారు. బేకరీని నిర్వహిస్తున్న జార్ఖండ్‌కు చెందిన అబ్దుల్ ముత్తలిబ్ సయ్యద్‌ను ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో బేకరీ యజమాని నిర్మల్‌కు చెందిన ముస్తఫాకు నెలవారీగా డబ్బులు చెల్లిస్తూ బేకరీ నిర్వహిస్తున్నట్లు వెల్లడైనట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న పదార్థాలు, కేకుల తో పాటు అబ్దుల్ ముత్తలిబ్ సయ్యద్‌ను ఎస్‌ఓటీ పోలీసులు మేడిపల్లి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాఘవేంద్రకాలనీలో అర్ధరాత్రి చోరీకి యత్నం

**ఉప్పల్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** బోడుప్పల్ రాఘవేంద్ర కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి ఓ ఇంట్లోకి ప్రవేశించి చోరీకి యత్నించిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ రాఘవేంద్రకాలనీలో నివసించే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించడానికి దొంత ప్రయత్నించారు. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న కుటుంబసభ్యులు దొంగను పగలగొట్టడానికి తీవ్రంగా ప్రయత్నించిన దుండగుడు శబ్దం విని గట్టిగా కేకలు వేశారు. దీంతో దొంగ గోడ దూకి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రధాన ఆకర్షణగా సుల్తాన్‌షాహి జగదాంబ దేవాలయ ఊరేగింపు

**- ఆకట్టుకున్న శకటాలు - అలరించిన కళాకారులు**



ఊరేగింపులో ఆకట్టుకున్న శకటాలు

**చాంద్రాయణగుట్ట, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ఆషాఢ మాస అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి పాతబస్తీలో జరిగిన మాతేశ్వరి ఘటాల సామూహిక ఊరే గింపు ఆద్యంతం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉమ్మడి కమిటి పరిధిలోని 23 ప్రధాన ఆలయాలకు చెందిన శకటాలు అలంకరణలో పోటీ పడ్డాయి. కళాకారుల ప్రదర్శనలు ఆబాల గోపాలాన్ని అలరించాయి. పలహారం బండ్ల సందడి అంతా ఇంతా కాదు. పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య సాగిన ఊరేగింపులో పలు ఆలయాల శకటాలు ఆకర్షణగా నిలువగా అందులో సుల్తాన్‌షాహిలోని చారిత్రక శ్రీ జగదాంబ దేవాలయం ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ చైర్మన్, భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ రాకేష్ తివారి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు విశేష కార్యక్రమాలను చేపట్టారు. వీటిలో వేషధారణలు, కళాకారుల ప్రదర్శనలు, మాతేశ్వరి శకట అలంకరణలు భక్తులను ఆకట్టున్నాయి. జగదాంబ ఆలయం వద్ద ఊరేగింపుకు చైర్మన్ రాకేష్ తివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాతేశ్వరి శకటాలు ప్రధా న ఊరేగింపుగా బయలుదేరి నాగులచింత చౌరస్తా, శాలిబండ, చార్మినార్, గుల్జార్‌హౌస్, పత్తర్‌గట్టి, మదీనా మీదుగా నయా పూల్ ఢిల్లీదర్వాజాకు చేరుకుంది. ముచుకుందా నది ఒడ్డున గల అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి మాతేశ్వరి ఘటాన్ని, తొట్టెలను విసర్జించారు. దారి పొడవున ఏర్పాటు చేసిన వేదికల నుండి అమ్మవారికి కొబ్బరి కాయలు, పూలతో స్వాగతం పలికి కర్పూర నీరాజనాలిచ్చారు. ఆలయ అధ్యక్షులు ఎ.సుదర్శన్, సలహాదారులు టి.రంజిత్ సింగ్, ప్రధాన కార్యద ర్శి రాజేష్ తివారి, కోశాధికారి ఎ.వేణుగోపాల్, ఉపాధ్యక్షులు ఎం.వరదరాజు, శ్రీరాములుచారి, కార్యవర్గ సభ్యులు శశాంక్ తివారి, బస్తీవాసులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉప్పుగూడ నరహరినగర్ శ్రీ బంగారు మైసమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పలహారం బండి ఊరేగింపును ఉమ్మడి మాజీ చైర్మన్ రాకేష్ తివారితో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఊరేగింపులో కళాకారుల ప్రదర్శనలు, డిజెలలో తీన్మార్ పాటలకు యువత చిందులేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తల్వార్ టిల్లు, తల్వార్ సన్నీ, సుల్తాన్‌షాహి శ్రీ జగదాంబ దేవాలయం కార్యవర్గ సభ్యులు శశాంక్ తివారి (మింటు), పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు. కాగా హుజూరాబాద్ నియోజక వర్గ బిఆర్ఎస్ శాసనసభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి లాల్‌దర్వాజా సింహవాహినిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన వారికి అర్చకస్వాములు వేదాశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. శాలువ, పూలమాలతో సన్మానించారు. ఎమ్మెల్యే వెంట రాకేష్ తివారి తదితరులున్నారు.



సింహవాహినిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

## ప్రజా సమస్యల పరిష్కారానికే సమీక్ష సమావేశం





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**–తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

**యాలాల ఆగష్టు 11,ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికి సమీక్ష సమావేశాలు చక్కటి వేదికలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం యాలాల మండల ప్రత్యేకాధికారి రవికుమార్ అధ్యక్షతన మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో అధికారులు,ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం జరిగింది.నూతనంగా ఎన్నికైన సర్పంచులకు వివిధ శాఖల అధికారులతో పరిచయం అనంతరం ఒక్కో శాఖ అధికారి సమావేశంలో ఎజెండా అంశాలను చదివి వినిపించారు.ఈ సందర్భంగ ఎమ్మెల్యే ఆయా శాఖలకు సంబంధించిన అధికారులను గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై నిలదీయాలని సూచించారు.ముఖ్యంగా విద్యుత్ ,పంచాయతీరాజ్, ఉపాధిహామీ, వ్యవసాయ,విద్య తదితర అంశాలపై సర్పంచులు సమావేశంలో సమస్యలు లేవనెత్తారు.రానున్న 45 రోజుల సమీక్షా సమావేశం వరకు ఆయా శాఖల అధికారులు సర్పంచులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా సర్పంచులు కృషిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి బాధ్యత ప్రజాప్రతినిధులదేనని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గుర్రాల సురేందర్‌రెడ్డి,ఎంపిడిఒ శ్రీనిజ.ఎమ్మార్వో గాయత్రి, సర్పంచులు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లపట్టాలు ఉన్న పేదల ప్లాట్ల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి

**శామీర్‌పేట, ఆగస్టు11, ప్రభాతవార్త:** ఉప్పరిపల్లి గ్రామంలో గతంలో ఇళ్ల పట్టాలు పొంది ఉన్న పేదల ప్లాట్లసమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డిని శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి మెంబర్ పి.బాలేశ్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మంగళవారం శామీర్‌పేట మండలం (డివిజన్) నుంచి నగరంలోని భేగంపేట్‌లో నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో ఆయనను కలిసి పి.బాలేశ్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్ మాట్లాడుతూ శామీర్‌పేట (డివిజన్) మండలంలోని ఉప్పరిపల్లిలో గత కొంత కాలంగా నెలకొన్న ప్రభుత్వ ప్లాట్ల సమస్యను అధికారుల దృష్టికి తీసుకవెళ్లటం జరిగిందని, పరిష్కారంలో జాప్యం జరుగుతుందని ఆయనకు వివరించి పరిష్కరించాలని కోరటం జరిగిందని అన్నారు. ఈ సమస్య కారణంగా సంబంధిత భూముల ప్లాట్లపై ఆధారపడి ఉన్న అర్హులైన నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నట్లు తెలుపటం జరిగిందన్నారు. ఉప్పరిపల్లి ప్లాట్ల సమస్యను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి స్పందించి పరిశీలించారని, వెంటనే మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఈ సమస్యను పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని ఆయన తెలిపారు. అలాగే సంబంధిత రెవెన్యూ రికార్డులు, భూముల, ప్లాట్ల వాస్తవ పరిస్థితిని, గతంలో జరిగిన విచారణలను, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించి న్యాయపరంగా నిర్ణయం తీసుకోవాలని కోరటం జరిగిందన్నారు. ఉప్పరిపల్లి ప్లాట్ల సమస్య పరిష్కారానికి కలెక్టర్‌ను ఆదేశించటం పట్ల గ్రామస్థులు పలువురు హర్షం వ్యక్తం చేసి త్వరగా సమస్య పరిష్కారం కానుందని శామీర్‌పేట మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్ ధీమాను వ్యక్తం చేశారు.



పేదల ప్లాట్ల సమస్యను ప్రభుత్వ పరిష్కరించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రంను అందజేసిన శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్ దృశ్యం

## అభివృద్ధి పేరుతో రైతులను దోపిడీ

**దుద్యాల్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల భూములను లాక్కొని దోపిడీ చేస్తోందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. హకీంపేట్ చౌరస్తాలో భూ నిర్వాసిత రైతులతో కలిసి మంగళవారం ధర్నా నిర్వహించారు. రైతులకు కేటాయించిన ప్లాట్ల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించి ప్రభుత్వం తన పారదర్శకతను నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అర్ధరాత్రి రైతులను అరెస్టు చేసి భూములు లాక్కున్నారని, వెంకటయ్య, బాబమ్మ, వెంకటమ్మ తదితర బాధిత రైతులకు న్యాయమైన పరిహారం అందలేదని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, ఇప్పటివరకు ఏ కంపెనీ వస్తుందో స్పష్టంగా చెప్పాలని నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు. రైతులకు ప్లాట్లు ఇచ్చే పేరుతో వెంచర్ ఏర్పాటు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతికి పాల్పడిన వారి నుంచి ప్రజాధనాన్ని తిరిగి కక్కిస్తామని అన్నారు.





ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్ నియోజకవర్గంలో రాయలసీమ కాంట్రాక్టర్లతో నాసిరకం రోడ్లు వేయిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు.

లగచర్లలో ఏర్పాటు చేయబోయే ఫార్మా పరిశ్రమకు నీటి తరలింపు కోసమే మక్తల్–నారాయణపేట–కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువల పనులు చేపడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కోట్ల యాదగిరి, మహేందర్‌రెడ్డి, బాబర్, నరేష్‌గౌడ్, మైపాల్‌రెడ్డి, మడిగే శ్రీనివాస్, కోట్ల మహిపాల్, బసప్ప, విశాల్, శివకుమార్, బుగ్గప్ప, గోపాల్, యాదయ్యతో పాటు భూ నిర్వాసిత రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.